క్లుప్తంగా

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. చిట్టినగర్ సొరంగం ప్రాంతానికి చెందిన కంప రూతుమణి, ఆనంద్‌బాబు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. రూతుమణి చేపల వ్యాపారం చేస్తుంటుంది. పెద్ద కుమార్తె కంప ప్రిన్సి(18) చీరాలలోని నానమ్మ ఇంటి వద్దే ఉండి చదువుకుంటుంది. పరీక్షలు పూర్తి కావడంతో నగరంలోని తల్లి వద్దకు వచ్చింది. మంగళవారం ఉదయం మణి వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చింది. ఇంటికి వచ్చే సరికి ప్రిన్సి కనిపించక పోవడంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ సేవలో సింగిల్ మూవీ టీం సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సింగిల్ మూవీ టీం సభ్యులు బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. సింగిల్ మూవీ హీరోహీరోయిన్‌లు శ్రీవిష్ణు, ఇవానాలతో పాటు చిత్ర బృందం ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తులపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ ఓ మహిళ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. లతా హాస్పిటల్ వెనుక ఆకుల రాజేశ్వరరావు వీధిలో బి.జయలక్ష్మి, కిరణ్‌కుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. కిరణ్‌కుమార్‌కు గతంలోనే వివాహమైంది. మొదటి భార్యకు విడాకులు ఇచ్చి జయలక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లు వీరి కాపురం బాగానే సాగింది. ఆ తర్వాత అదనపు కట్నం తేవాలంటూ భర్త కిరణ్‌కుమార్ అత్తమామలు కృష్ణారావు, సుకన్య, ఆడపడుచు తనూజ శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారు. వివాహ సమయంలో రూ. 10 లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. వీటికి తోడు అదనంగా కట్నం తేవాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో కిరణ్‌కుమార్ భార్యతో గొడవపడి ఆమెను కొట్టాడు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోడ్రైవర్‌పై యువకుల దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాత గొడవల నేపథ్యంలో ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఘటన విద్యాధరపురం చెరువు సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన వినుకోట శివ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 13వ తేదీ తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆటోకు వెళ్లి ఇంటికి వస్తుండగా చాణక్య, సూర్య, మరికొంత మంది యువకులు అడ్డగించారు. ఆటోడ్రైవర్‌ను బూతులు తిడుతూ దాడి చేశారు. నీ సంగతి తేలుస్తాం.. నిన్ను చంపుతాం అంటూ బెదిరింపులకు దిగారు. ఈలోగా ఆటో డ్రైవర్ భార్య సుజాత, అక్క దుర్గ, అన్నయ్య దుర్గారావు అక్కడికి చేరుకోగా యువకులు పారిపోయారు. దీనిపై బాధితుడు శివ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ యువకుల వలన తనకు ప్రాణ హాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన నరసింహస్వామి కల్యాణోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రి పవళింపు సేవతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, శ్రీధరాచార్యులు, మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో ద్వాదశ సేవలు, 12 ఆరగింపులు, పుష్పయాగం, పర్యాంకాసనోత్సవ సేవలను నిర్వహించి కల్యాణోత్సవాలు ముగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సురేష్‌బాబు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశ్చిమంలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకం?

- రోడ్లపైనే గ్యాంగ్ వార్‌లు
- వేళాపాలా లేని మద్యం అమ్మకాలు
- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- పట్టపగలే దొంగతనాలు
- పట్టించుకోని పోలీసు అధికారులు



వెస్ట్‌జోన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. ఆయా పోలీసుస్టేషన్ల అధికారుల నిర్లక్ష్యంతో తలెత్తుతున్న పరిస్థితులతో స్థానిక ప్రజానీకం భయకంపితులవుతున్నారు. మద్యం బాబులు చిందులు వేస్తూ స్థానికులను హడలెత్తిస్తున్నారు. నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న పరిస్థితులపై ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవటంతో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కీలక ప్రాంతాల్లో పూర్తిగా నిఘా కొరవడటంతో రౌడీలు, మందుబాబులు అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రజలందరూ చూస్తుండగానే రహదారులపైనే గ్యాంగ్‌వార్‌లు చోటు చేసుకుంటున్నాయి. ప్రజలు రాకపోకలు సాగిస్తున్న సమయంలోనే సినిమా సీన్‌లను తలపించేలా యువకులు బృందాలుగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నా పట్టించుకునే పోలీసు అధికారులు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వించిపేటలో జరిగిన ఒక వివాహానికి హాజరైన యువకులు మద్యం మత్తులో వివాదాలకు దిగి అక్కడి నుంచి కొత్తపేట పరశురామయ్య వీధికి చేరుకొని ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. దీంతో స్థానిక నివాసితులు భయాందోళనకు గురై బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. ఇంత జరిగిన పోలీసులకు సమాచారం లేదు. అది జరిగిన తీరును సోషల్ మీడియాలో హల్‌చల్ జరిగితే అప్పుడు స్పందించిన పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేసి వదిలేశారు. ఇదే తీరులో భవానీపురంలోనూ చోటు చేసుకుంటున్నాయి.

వేళాపాలా లేని మద్యం అమ్మకాలు....

పశ్చిమ నియోజకవర్గంలోని ఆయా పోలీసుస్టేషన్ల పరిధుల్లోని మద్యం దుకాణాలపై పోలీసు అధికారులకు పూర్తిగా పర్యవేక్షణ లోపించింది. కొంతమంది సిబ్బంది ముడుపుల మత్తులో జోగుతున్నారు. మద్యం దుకాణాల వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా పగలు రాత్రి లేదా లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. తెల్లవారుజామున బహిరంగంగానే దుకాణాలు మద్యం దొరుకుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భవానీపురం, విద్యాధరపురం, చిట్టినగర్, కొత్తపేట, కెనాల్‌రోడ్డు ఇలా ప్రతి చోటా మద్యం దుకాణాలు విచ్చలవిడిగా సమయపాలన లేకుండా విక్రయాలు కొనసాగిస్తున్నాయి.

కొరవడుతున్న నిఘా....

నియోజకవర్గ పరిధిలో నిఘా పూర్తిగా కొరవడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే దొంగతనాలు, నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే దుర్గమ్మ సన్నిధిలో పట్టపగలు కారులో చోరీ జరిగి లక్షలాది రూపాయాలు బంగారం మాయమైన సంఘటన తెలిసిందే. అలాగే ఇటీవల గద్దబొమ్మ సెంటర్‌లో ఇద్దరు ఆటో డ్రైవర్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఒకరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పాతబస్తీలో ఎలక్ట్రికల్ దుకాణంలో పని చేసే యువకులు రోడ్డుపై దాడులకు దిగారు. ఇవన్నీ స్టేషన్లలో నమోదైన సంఘటనలు మాత్రమే. ఇవి కాకుండా పోలీసుస్టేషన్‌కు రాని సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. కేవలం నిఘా కొరవడటం వలనే ఈ విధమైన సంఘటనలు నిత్యం పెరుగుతున్నాయని స్థానిక ప్రజానీకం విమర్శిస్తుంది.

గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దాలి



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో రోడ్లపై గుంతలు లేకుండా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా బుధవారం ఆయన మిల్క్‌ప్రాజెక్ట్, క్రాంబే రోడ్, సింగ్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్లపైన గుంతలను ఎప్పటికప్పుడు సచివాలయం సిబ్బంది వారి సచివాలయం పరిధిలో పరిశీలించి, చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పైన ఎటువంటి గుంతలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సింగ్‌నగర్ ఫైర్ స్టేషన్ వద్ద ఉన్న పార్కులో ప్రవేశ ద్వారాన్ని ఏర్పరచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించేలా పార్కులోని మొక్కలు పెంచాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌ను ఆదేశించారు.

గార్బేజ్ పాయింట్లపై ప్రత్యేక శద్ధ..

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా నిరంతరం చర్యలు తీసుకోవాలని కమిషనర్ చెప్పారు. ప్రజారోగ్య విభాగం అధికారులు రోడ్లపై ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, గార్బేజ్ పాయింట్లపై ప్రత్యేక శద్ధ వహించాలన్నారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని వీధులను జోన్ల వారీగా విభజించాలి


మాట్లాడుతున్న వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పరిధిలోని వీధులను జోన్ల వారీగా విభజించాలని చీఫ్ సిటీ ప్లానర్‌సంజయ్ రత్నకుమార్ ఆదేశించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని మీటింగ్ హాల్‌లో ఆయన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లానింగ్ సెక్రటరీ నుంచి అసిస్టెంట్ సిటీ ప్లానర్ వరకు క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఫీల్డ్‌లో ఉండాలన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ మాస్టర్ ప్లాన్ ప్రకారంగా విధులు నిర్వహించాలని, నిర్మాణం జరుగుతున్న ప్రతి భవనానికి కచ్చితంగా గ్రీన్ మ్యాట్ ఉండాలని, కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలేషన్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి..

మెయిన్ రోడ్లలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు వెంటనే తొలగించాలన్నారు. తాజాగా నిర్వహించిన టౌన్ వెండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాన్ని అనుసరిస్తూ వీధి వ్యాపారస్తులకు, వీధి వ్యాపారస్తుల చట్టం ప్రకారం ఉన్న రెడ్ జోన్, యంబర్ జోన్, గ్రీన్ జోన్లను గుర్తించేందుకు పట్టణ ప్రణాళిక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. విజయవాడ నగర పరిధిలోని వీధులన్నీ జోన్ల వారీగా విభజించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మోహన్ బాబు, రాంబాబు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు భాగస్వాములు కావాలి

సీఐటీయు నాయకులు బోయి సత్యబాబు


సమ్మె బులెటిన్‌ను ఆవిష్కరిస్తున్న సత్యబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్ట్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు భాగస్వాములు కావాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని శానిటరీ కార్యాలయం వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు, సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్, పార్క్స్, వెహికల్ డిపో, వీధిలైట్ల విభాగ కార్మికులకు జీఓ ఎంఎస్ నంబర్ 36 ప్రకారం స్కిల్, సెమీ స్కిల్ వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు పట్టించుకోక పోవడం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 20వ తేదీన సమ్మెకు దిగనున్నామని వివరించారు. ఈ సందర్భంగా సమ్మెకు సంబంధించిన బులెటిన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు సూరిబాబు, పశ్చిమ మున్సిపల్‌రంగ కార్మిక నాయకులు వేల్పుల సాంబశివరావు, చెన్నా జగదీస్, కలపాల ప్రసాద్, సింగంపల్లి శ్రీను, బోరిశెట్టి పద్మ, చెన్న కొండమ్మ, మారేపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా నేతల అరెస్ట్‌పై పీఓడబ్ల్యూ ఖండన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకించిన మహిళా సంఘాల నాయకుల అరెస్ట్, గృహ నిర్బంధాలను ఖండిస్తూ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం జరిగింది. జాతీయ నాయకుల సంధ్యక్క అక్రమ అరెస్టును మహిళా సంఘం నేతలు ఖండించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు పి.పద్మ మాట్లాడుతూ.. మహిళలను శరీరాల ద్వారానే గుర్తిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకించాలన్నారు. మహిళ శరీరాన్ని పణంగా పెట్టి సాధించే అభివృద్ధిని దేశ అభివృద్ధి అని.. ఇది దేశానికి గర్వకారణమని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ ఉద్యమించిన మహిళా నాయకులను లాఠీచార్జి చేసి అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సర్వే ప్రారంభం


వీధి వ్యాపారస్తుల వివరాలు నమోదు చేస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వీధి వ్యాపారస్తుల సర్వేను ప్రారంభించినట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఇటీవల వీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్ట్రీట్ వెడ్డింగ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా వీధి వ్యాపారస్తుల సర్వేను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 2018 సర్వే ప్రకారం నగరంలో 17,282 వీధి వ్యాపారస్తుల ఉన్నారన్నారు. ప్రస్తుతం ఎంత మంది వీధి వ్యాపారస్తులుగా ఉంటున్నారు, గతంలో వారితో పాటు కొత్తగా ఎంతమంది వ్యాపారాలు చేస్తుంది ఈ సర్వేలో నమోదు చేస్తామని చెప్పారు. 64 డివిజన్లలోని 286 సచివాలయాల పరిధిలో ఉన్న 286 వెల్ఫేర్ సెక్రటరీస్ ఎన్యూమరేటర్స్‌గా, ఆరుగురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో, ముగ్గురు జోనల్ కమిషనర్ల పర్యవేక్షణలో సర్వేను వెండర్ కనెక్టర్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారన్నారు.

త్వరలో గుర్తింపు కార్డుల జారీ..

వివిధ వీధి వ్యాపారస్తుల అసోసియేషన్ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు, ఆర్పీలకు, స్వయం సహాయక సంఘాలకు, వీధి వ్యాపారస్తుల సర్వే గురించి సమాచారం అందించారని కమిషనర్ చెప్పారు. నగర పరిధిలోని వీధి వ్యాపారస్తుల సర్వే ముగిసిన తదుపరి గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. ఈ సర్వేలో భాగంగా వీధి వ్యాపారస్తులకు 45 అంశాలతో కూడిన నివేదికను సేకరిస్తారని, వారికి వారి కుటుంబ సభ్యులకు వీధి వ్యాపారంతోనే జీవనోపాధి ఉందన్న ధ్రువీకరణ పత్రం సర్వేలో భాగమని తెలిపారు. తద్వారా అసలైన వీధి వ్యాపారస్తులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సర్వేను త్వరలోనే పూర్తి చేసి గుర్తింపు కార్డులు అందిస్తామని తెలిపారు.

ఘనంగా తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి


అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న బృంద సభ్యులు

విజయవాడకల్చరల్: అన్నమయ్య సంకీర్తనా గాన ప్రచార భక్త బృందం ఆధ్వర్యంలో ముత్యాలంపాడులోని శ్రీ పట్టాభిరామ స్వామి దేవాలయ సముదాయంలో బుధవారం అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు కసూర్తి గోపాలరావు అన్నమయ్య రచించిన సంకీర్తనలు వినరో భాగ్యము, అంతయు నీవే, చిన్ని శిశువు తదితర సంకీర్తలను మధురంగా ఆలపించారు. సంస్థ నిర్వాహకుడు పప్పు సదాశివ శాస్త్రి నిర్వహించారు.

శ్వాస ఆధ్వర్యంలో..

అన్నమయ్య సంకీర్తనా అకాడమీ, కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నామాచార్యుల 617వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు మధురంగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో హరిద్రా మ్యూజిక్ అకాడమీ బృంద సభ్యులు, మల్లాది అభిజ్ఞ, మల్లాది అనన్య, చెంగల్వల రంజని, మునుకుట్ల యశస్విని, కేవీ బ్రహ్మానందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మాగంటి వేణుగోపాల్, కార్యనిర్వాహకుడు సీహెచ్ రామ్మోహనరావు, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

ఎంబీ విజ్ఞాన కేంద్రంలో కంటి వైద్య పరీక్షలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెల రోజులుగా విజ్ఞాన కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 100 మంది విద్యార్థులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంబీ విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి బీఆర్ తులసీరావు ప్రారంభించి మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లకు, టీవీలకు ఎడిక్ట్ అవుతున్న పిల్లలకు చిన్న వయసులోనే కళ్లజోళ్లు వేసుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కంటి సమస్యలు రాకుండా సరైనాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీ విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌కి 60 యూనిట్ల రక్తదానం


రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఏసీపీ ప్రసాద్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేవుని సంఘం ప్రపంచ పరిచర్య సంస్థ చైర్మన్ పాస్టర్ కిమ్ జూచ్యోల్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో హోటల్ కొనల వద్ద నిర్వహించిన శిబిరంలో 60 మంది ఆ సంఘ విశ్వాసులు రక్తదానం చేశారు.

రక్తదాన శిబిరాన్ని ఏసీపీ ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం, వర్గం అనే బేధం లేకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సామ్‌సంగ్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత, కౌన్సిలర్ జోస్పిన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నిధులు ఒకేసారి జమచేయాలి

గన్నవరం: అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు పంట సాయంను ఒకేసారి రైతుల ఖాతాల్లో జమచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కొలుసు శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ నిధులు మూడు సార్లుగా జమ చేయడం వల్ల రైతుల వ్యవసాయ అవసరాలు తీరవన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే ఒకేసారి ఇవ్వడం వల్ల రైతులకు మరింత మేలు చేకూరుతుందని తెలిపారు. బ్యాంక్‌లు రైతులకు పూర్తిస్థాయిలో పంట రుణాలు మంజూరు చేయకపోవడం వల్ల అన్నదాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ అవసరాలకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు, కౌలుదారులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట

కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట ఆదేశించారు. ఉప్పలూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఓపి వివరాలను వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రికను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు మెరుగ్గా అందేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో ఉండే క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. తనిఖీలో వైద్యాధికారులు డాక్టర్ అంజు, డాక్టర్ సాయి నికిత, ఎం పి హెచ్ ఈ ఓ కష్టారావు, పిహెచ్ఎన్ రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పునీత జోజప్ప ఆలయ వార్షికోత్సవం

తుట్టగుంట(గన్నవరం): ఉంగుటూరు మండలం తుట్టగుంట గ్రామంలో పునీత జోజప్ప ఆర్‌సీఎం దేవాలయం ప్రథమ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెవరెండ్ ఫాదర్ అవినాష్ పరిశుద్ధ దివ్యపూజబలిని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...ప్రజలంతా ఐక్యతా భావంతో మెలగాలని చెప్పారు. అతి చిన్న గ్రామమైన తుట్టగుంటలో ఇంతటి ఆలయ నిర్మాణం చేయడం అభినందనీయమని పెద్దఅవుటపల్లి విచారణ గురువులు ఫాదర్ అభిలాష గోపు తెలిపారు. చర్చి నిర్మాణానికి కారకుడైన గుడిసె బాలస్వామి కృషి మరువలేనిదని చెప్పారు. అనంతరం బాలస్వామి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు నేతృత్వంలో భక్తులకు ప్రత్యేక విందు ఇచ్చారు. సాయంత్రం మరియమాత స్వరూపంతో తేరు ఊరేగింపు నిర్వహించారు. ఫాదర ఏసుపాదం, ఫాదర్ సుధీర్, సంఘ పెద్దలు పిల్లి ఏసుపాదం, చిన్నం డేవిడ్, చింతలపూడి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ క్రాఫ్ట్, పెయింటింగ్‌లో శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు బుధవారం పేపర్ క్రాఫ్ట్ వర్క్, పెయింటింగ్‌లో శిక్షణనిచ్చారు. అధ్యాపకురాలు స్వాతి పూర్ణిమ విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. పేపర్ క్రాఫ్ట్ చేసే విధానం, పెయింటింగ్‌లో బేసిక్స్ నేర్పించారు. మరో టీచర్ సుస్మిత విద్యార్థులకు సులభంగా గణిత సమస్యలు పరిష్కరించడంలో శిక్షణనిచ్చారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు చాలా ఆసక్తితో నేర్చుకుంటున్నారు. కథలు చెప్పడం, విద్యార్థులచే పుస్తకాలు చదివించడం, క్యారమ్స్ ఆడించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయాధికారి కె.నాగరాజు, సిబ్బంది జి.ఉమారాణి, కె.రాంబాబు, పీవీవీ ఫణి బాబు పాల్గొన్నారు.